# చక్కనీ రాజమార్గము ఉండగా....

"మైథిలి!"

"ఆహా! చాలా అందమైన పేరేనే!"

"ఈ కొత్తపిట్ట ఈఏడు క్రొత్తగా వచ్చిందా గురూ?"

"ఆఁ, క్రొత్తగా జేరింది. ఇంకా వివరా లేం తెలియవు!"

"త్వరగా తెలుసుకోవోయ్ మరి? ఆలస్యం దేనికి?" అందరి నాయకుడు ప్రసాద్ ఆజ్ఞాపించాడు.

అన్ని జతల కళ్ళూ తననే శ్రద్ధగా పరికిస్తూండగా, ఎవ్వరినీ ఎటూ చూడకుండా హుందాగా నడచిపోయింది మైథిలి.

"బాప్ రే బాప్! ఏమి ఠీవిరా! ఇక్కడ యింతమంది వీరులం వుండగా ఎటువంటి ప్రాణీ లేనట్లే నడచిపోయింది. కొంచెం యిటు చూస్తే ఆవిడ సొమ్మేమైనా పోతుందా?" సీతారాం గుండెలు బాదుకున్నాడు.

"ఎంత నిర్లక్ష్యం! ఇదేమిటో కొంచెం మనం ఈ కేసు హాండిల్ చేయాల్సిందే!" రామారావు అన్నాడు.

"ఆమాట వేరే చెప్పటమెందుకోయ్ చవటా? మన కన్నుపడితే అంతుచూడకుండా వదిలినదెప్పుడు?" గర్వంగా మీసం మీద చెయ్యివేసుకున్నాడు ప్రసాద్.

కళాశాలలో డిగ్రీకోర్సు ఆఖరి సంవత్సరంలోనున్న ఆ బృందాన్ని చూస్తే ఉపాధ్యాయులకూ, ప్రిన్సిపాల్ కూ కూడా భయమే. విద్యార్థినీ, విద్యార్థులమాట చెప్పనవసరం లేదు.

బృందానికి నాయకుడైన ప్రసాద్ అంటే ఇక సింహ స్వప్నమే. కోటీశ్వరుని కొడుకైన ప్రసాద్ ఆజ్ఞ లేకుండా విద్యార్థులు సమ్మెలూ, గొడవలు ఆరంభించరు; అతడి అనుమతి లేకుండా విరమించరు. అతడు శ్రమపడి చదవకపోయినా ప్రథమశ్రేణి మార్కులు అతడిని వెతుక్కుంటూ వస్తాయి.

"మన కటాక్షవీక్షణం లేనిదే ఇక్కడ లెక్చరర్స్ కూడా బ్రతకలేరనేది సాధ్యమైనంత త్వరలో తెలియచెయ్యండోయ్."

"చిత్తం గురూ!" ఆశ్రితకంఠాలన్నీ వినయంగా, ఉత్సాహంగా జవాబిచ్చాయి.

సినిమాలు, హోటళ్ళు, ఖరీదైన బట్టలు – వగైరా సమస్త ఖర్చులూ ఆ ఆశ్రితబృందానికి ప్రసాదే భరిస్తాడు. తమపాలిట కల్పతరువైన ఆ ప్రసాద్ ఆజ్ఞలను తు. చ. తప్పకుండా నిర్వహిస్తారు ఆ బృందంలో సభ్యులంతా.

సదరు బృందంలో కేవలం విద్యార్థులేకాదు, విద్యార్థినులుకూడా వున్నారు.

ఆ విద్యార్థినులలో ఒకరైన మేరీ యింట ఒక సాయంత్రం ఆరుగంటల సమయంలో పేకాటా, చర్చలూ జోరుగా సాగుతున్నాయి.

"ఈ రోజంతా పరధ్యానంగా వున్నావేం ప్రసాద్?" కుర్చీచేతిపై కూర్చుని ప్రసాద్ భుజంపై చేయివేసి గోముగా అడిగింది, నవనాగరిక వేషధారణలోనున్న మేరీ.

"ఊఁ." పరధ్యానంగావున్న ప్రసాదునుండి సరైన సమాధానం లేదు.

"చెప్పూ." మేరీ స్వరంలో లాలన; కనులలో లాలన! అతడి పెదవులకు సిగరెట్ అందించి లైటర్ వెలిగిస్తూ మఱిలా అడిగింది కవ్వించుతూన్న చూపులతో.

"మైథిలి తెలుసా?"

"ఊఁ!" కలవరపాటును పైకి వ్యక్తీకరించకుండా జాగ్రత్తపడింది మేరీ. "ఈ సంవత్సరమే జేరింది ఫస్టియర్‌లో. ఇంకా వివరాలు తెలియవు."

"ఆ మైథిలితో స్నేహం చెయ్యి!" జేబులోనుండి తీసిననోట్లు ఎన్నోకూడ చూచుకోకుండా మేరీచేతవుంచి టకటకా వెళ్ళిపోయాడు.

"ఊఁ." క్రోధాసూయలతో తల పంకించింది మేరీ. "అబ్బాయిగారు క్రొత్త పిట్టవేటలో వున్నారన్నమాట!"

"అదేం బాగుంటుందోయ్ ముసలమ్మలాగా యింత పొడుగు జడా, అతి మామూలు చీరలూనూ! దాన్లో ఏం అట్రాక్షన్ కన్పించిందీ – ఈ షోకుల రాయుడికి?" మరో బెల్ బాటమ్, గిరజాల నల్లసుందరి అసహ్యాన్ని వెల్లడించింది.

"నీ కదంతా ఎందుకూ? మన హీరోగారి ఆర్డర్ ప్రకారం ఆ పిల్లతో స్నేహం చేసి సామ దాన భేద దండోపాయాలన్నీ ఉపయోగించి మన కూటమిలో జేర్చు." ప్రసాద్‌కు కుడిభుజంగా వర్తించే గోపాల్ అన్నాడు.

'మైథిలి చాలా సౌందర్యవతి' అని ఎదురు వాదించి మేరీ స్నేహం పోగొట్టుకోదలచుకోలేదతడు.

"చిత్తం!" మూతివిరుపుతో అన్నది మేరీ. ప్రసాద్ తనతో అమిత ప్రేమ నటిస్తూ కేవలం యిటువంటి వ్యవహారాలకే ఒక పరికరంగా వాడుకుంటాడని ఆమెకు తెల్సు.

అయినా వేరు దారిలేదు. నామకార్థం ఓ చిన్నదీ పెద్దదీ కాని ఫ్యాన్సీషాపు నడుపుతున్నాడు మేరీ తండ్రి. ఆమె తల్లి ఎలిమెంటరీ స్కూల్ టీచర్. మేరీ తెలివీ, చాకచక్యాలవల్లనే ఆ షాపూ, ఎనమండుగురున్న కుటుంబమూ నడవడమేగాక అందరికీ మంచి చదువులూ, దర్జా వేషాలూ సమకూర్తున్నాయి.

మేరీ స్నేహితులు ఆడా–మగా వివక్షత లేకుండా ఎప్పుడైనా ఆమె యింటికి వెళ్ళి ఎంతసేపైనా వుండవచ్చు ప్రసాద్ వంటి బంగారుపిచ్చుకలు రెండు మూడు వున్నాయి

మేరీచేతిలో. ఆ స్నేహబృందం వున్నంతసేపూ తాము యింటి చాయలకే పోకుండా ఏదో పనిమిషతో ఎక్కడికో పోతారు ఆ తల్లీ తండ్రీ.

ఇటువంటి కుటుంబంలోని మేరీకి ప్రసాద్‌వంటి యువకులతో స్నేహం తప్పనట్లే యిష్టమున్నా లేకున్నా వారి ఆజ్ఞలను శిరసావహించడంకూడా తప్పనిసరి. ఇటువంటివి అలవాటైపోయాయి ఆమెకు.

ఈ కార్యసాధన మిషతో ప్రసాద్‌నుండి ఎంత లబ్ధి, ఎన్ని రూపాలలో పొందవచ్చునో అంచనా వేసుకోసాగింది మేరీ.

## 2

"ఈ ఏడే జేరావనుకుంటాను నీవు కాలేజీలో?" అతి స్నేహస్వరాన చనవు కల్పించుకొంటూ అడిగింది మేరీ మైథిలిని.

"ఔను." ఒక్కసారి మేరీని ఎగాదిగా చూచి ముక్తసరిగా సమాధానం చెప్పింది మైథిలి. మరుక్షణంలో తిరిగి తాను చదువుతూన్న పుస్తకంలో లీనమై పోయింది.

"అరె!" ఆశ్చర్యమూ చనవూ కలబోసి మాట్లాడుతూ మైథిలి కుర్చీయెదుటి టేబుల్‌మీదికెక్కి కూర్చున్నది మేరీ.

"నిత్యం పుస్తకాలు! పుస్తకాలు! ఎప్పుడూ చదువేనా? బోర్ కొట్టడంలేదూ?"

మైథిలి విస్మయంగా చూచింది, "చదువుకోసమేగా కాలేజీకి వస్తున్నామూ?"

పకపకానవ్వింది మేరీ ఒళ్ళు కుదుపుకొంటూ, "నీవంటి వెఱ్ఱి అమ్మాయిని నేను చూడడం యిదే ప్రథమం." మళ్ళీ నవ్వింది.

మైథిలి ఏమీ మాట్లాడకపోయినా ఆమె చిరాకంతా ఆమె చూపులలో ప్రతిఫలించింది. అది మేరీ గమనించినా, ఆమెలో అటువంటివి ఈషణ్మాత్రపు మార్పునుకూడా కలిగించవు. ఎదుటి వారు నుదుట ఉమిసినా, చెప్పుదెబ్బ కొట్టినా తుడిచివేసుకొని నవ్వగల దామె కార్యసానుకూలతకోసం.

"ఎంతవఱకొచ్చింది పరిచయం?" అని ఆ సాయంత్రం అడిగిన ప్రసాద్‌కు, "ఏట్లో కలిసినట్లేవుంది మా పరిచయం. అదెక్కడ—అదో హిమాలయపర్వతం! దాన్ని కరగించడం మాటలా?" అన్నది విసుగ్గా మేరీ.

"ఊఁహూఁ! అలాగా?" తమాషాగా తల పంకించుతూ, ఆశ్చర్యంగా చూచాడు ప్రసాద్.

నిమ్మకు నీరెత్తినట్లున్న అతడి ఈ ధోరణి మరింత కోపకారణమైంది మేరీకి.



కథా నిలయం
4748
శ్రీకాకుళం

"అయినా నీ కిలాంటి ముసలమ్మలూ, అప్పలమ్మలలో ఆకర్షణ ఏమిటో నా కర్థంకాదు." విసుక్కుంది.

"జెలసీ!" నిర్లక్ష్యంగా నవ్వాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

దెబ్బతిన్నట్లు చూసింది మేరీ. "ఇదుగో ప్రసాద్, ఇలాంటి మాటలంటే నే నూరుకోను. అదంటే నాకేం జెలసీ? అఫ్టరాల్ – నూలుగుడ్డలూ, కాలినడక బ్రతుకేగా?"

"ఓయబ్బ!" ప్రసాద్ కుడిభుజం రాధాకృష్ణ కలిగించుకున్నాడు. "ఈ బంగారు పిచ్చికే లేకుంటే మనమందరం ఎలావుందు మంటావ్?"

మేరీ కోపంగా ఏదో అనబోయేంతలో ప్రసాదు అసహనంగా అన్నాడు: "స్టాప్ దిస్ నాన్సెన్స్, ఎందుకీ అనవసర దెబ్బలాటలు? సరే, ఆ సంగతి వదిలేయండి."

ప్రసాద్ అలాగన్నాడంటే, ఆ విషయం తాను స్వయంగా చేపట్టుతా డన్నమాట!

"అన్నట్టు...మనం ఎక్కడికైనా ఎక్స్‌కర్షన్ వెళ్ళి చాలారోజులై పోలేదూ? ఈ దీపావళికి ఎటైనా వేసుకుందాం ఏమిటీ?" అన్నాడు పేకముక్కలు పంచుతూ.

"ఓకే, గురూ! తమరు ఆజ్ఞాపించటం, మేము అంగీకరించడం. అంతే." అన్ని కంఠాలు హుషారుగా అన్నాయి.

"అయితే చెప్పండి. ఎక్కడికి?"

తర్జన భర్జనల తర్వాత, గోల్కొండ కోట చూడ టానికి నిర్ణయం జరిగింది.

"మరి...మరి...ఎవరెవరొస్తారో !"

రాధాకృష్ణ ఈ అర్థంలేని ప్రశ్నకు చికాగ్గా చూశాడు ప్రసాద్.

"ఏమిటా చచ్చుప్రశ్న?"

"అదే. ఆ...ఆ అమ్మాయి..."

"ఓ! చూద్దాం. ప్రైచెయ్యి మేరీ!"

"చిత్తం." అయిష్టంగా, హేళనా స్వరంతో ఒప్పు కున్నది మేరీ.

# 3

"దీపావళికి రెండ్రోజులు సెలవు వస్తున్నది, నీ ప్రోగ్రాం ఏమిటి ?"

మేరీ ప్రశ్నకు అర్థంకానట్లు చూచింది మైథిలి.

రెట్టించింది మేరీ.

"ఏముందీ ? కోర్సు అంతా రివైజ్ చేసుకుంటా నోసారి. ఎవరుమాత్రం స్టూడెంట్స్ ఏంచేస్తారు సెలవు లొస్తే?"

అదేపనిగా ఆపకుండా అయిదునిమిషాలు నవ్వింది మేరీ.

విస్మయంగా చూడడమే కాని, మైథిలికి ఏమీ అర్థం కాలేదు.

నవ్వాపిన తర్వాత, "ఈ రోజుల్లో స్టూడెంట్‌కు చదువు ముఖ్యంకాదు" అన్నది సీరియస్‌గా. "పరీక్షల్లో కూడా ఏ విద్యార్థీ చదవడు ఈనాడు. అందులో మా గ్రూప్ వున్నదే - అస్సలు చదవాల్సిన కష్టమే లేదనుకో !"

"నీ గ్రూపూ నా గ్రూపూ ఒకటేగా?"

"ఓ! సబ్జెక్ట్సు మాటకాదు నే ననేది. మా స్నేహ బృందం మాట !" అంటూ మైథిలిక ముఖకవళికలను జాగ్రత్తగా పరీక్ష చేయసాగింది.

మైథిలి వదనంలో చెప్పదగ్గ మార్పులేం కన్పట్టలేదు. "మీరంతా ఏకసంతగాళ్ళిహులన్నమాట! నే నంత అదృష్ట వంతురాల్ని కాను" అన్నది చిన్నగా నవ్వుతూ.

"పోన్లే, ఆ సంగతి వదిలేయి కాని, నేనింతగా నీతో మాట్లాడుతూంటే అలా తూచి తూచి మాట్లాడ్తావేం? నేనంటే యిష్టంలేదా?"

"అరరె! అటువంటిదేంలేదే ?" కంగారుగా అన్నది మైథిలి. "క్రొత్తవారితో ఎక్కువ మాట్లాడలేను నేను."

"నువ్వలా దూరదూరంగా వుంటే ఎన్నిరోజులూ, సంవత్సరాలూ గడచినా అంతా క్రొత్తగానే వుండిపోతారు మరి ! పరిచయం చేసుకోవాలి. అలా మైల్డ్‌గా వుండకూడదు. ఎంతమంది స్నేహితులుంటే అంత గొప్ప ఈ రోజుల్లో."

మైథిలి మాట్లాడలేదు.

"నన్ను చూడూ, నువ్వు మాట్లాడకపోయినా ఎలా పిలిచి పిలిచి వచ్చి స్నేహంచేస్తున్నానూ? అలా వుండాలి యాక్టివ్‌గా. అన్నట్టు... దీపావళికి అందరం గోల్కొండ ఫోర్టు అవీ చూడటానికి వెళ్తున్నాం. నువ్వూ రా. అందరితో పరిచయం ఔతుంది చక్కగా."

మైథిలి తలవాల్చుకుని మెల్లగా అన్నది "సారీ, నేను రాలేను."

"ఎందుకనీ?"

"మాయింట్లో పంపించరు అటువంటి వాటికి."

"అంటే?"

"అదంతే. కాలేజినుంచి మామూలు టైముకు అయిదు నిముషాలు ఆలస్యంగా వెళ్ళినా కోప్పడతారు మా నాన్న గారు. ఇక పిక్నిక్‌లవీ అసలు పేరెత్తడానికే వీల్లేదు."

మనసులోని ఆశ్చర్యం పైకి కన్పించకుండా, తేలికగా తీసి పారేస్తూన్న స్వరంతో అన్నది. "ఛీ ఛీ, ఇంకా పెద్దాళ్ళ అధికారంలో పడుండటమే? అందుకే అన్నాను పాపం నువ్వు పూర్తిగా పాతకాలపుదానవని."

ఈ విప్లవకారిణిని విసుగ్గా, విస్మయంగా చూచింది మైథిలి.

"ఏమిటి మేరీ? మైథిలికూడా వస్తోందా?" మేరీ స్నేహితురాండ్రు జయా, గంగా వచ్చారు.

"ఎక్కడికి ?" మైథిలి అర్థంకాక అడిగింది.

"దీపావళి రెండ్రోజుల సెలవూ సర్దాగా పిక్నిక్ వేసుకున్నాం. స్పెషల్ బస్‌లో వెళ్ళి హైదరాబాద్, గోల్కొండ అవీ చూస్తాం. నువ్వూ రారాదూ ?" జయ అన్నది.

"ఇదెక్కడిదానవ్ ?" గంగ హేళనగా నవ్వింది. "మా క్లాసువాళ్ళు అయిదారుగురు వస్తున్నారు. ఇంత వఱకూ నీ కీ విషయం తెలియనే తెలియదా ?"

మైథిలి తొణకలేదు. చిన్నబుచ్చుకోలేదు. "అవన్నీ ధనవంతుల సరదాలు. నాకు కాదు." మామూలుగా అన్నది.

గంగా, మేరీ ముఖముఖాలు చూచుకున్నారు. ఇదే అదనన్నట్లుగా గంగ మేరీకి కన్నుగీటింది.

"చూడు మైథిలీ, డబ్బుగురించి నువ్వు విచారించవద్దు. ఆ విషయం నీవు మఱచిపో. నేను చూచుకుంటాను. గంగ కూడా డబ్బు కట్టలేదు. అంతమాత్రాన మేమందరం లేమూ ? వదులు కుంటామా ?"

అర్థంకానట్లు విస్మయంగా చూచింది మైథిలి.

"యాభైమంది కలసి వెళ్తూన్నప్పుడు ఎవరో ఒక రిద్దరు లేకపోతే ఏం మైథిలీ? అంతమాత్రాన వదలుకుంటామా? అందరి ఖర్చూ భరించగలవాళ్ళు చల్లగా వుండాలేగానీ... అందర్నీ పరిచయం చేస్తాగా ? నువ్వు వచ్చేసేయి."

నిశ్చలంగా వింటూన్న మైథిలి ముఖ కవళికలలో ఈషణ్మాత్రం మార్పుకూడా లేదు. "సారీ! ఇతరుల దయా ధర్మ భిక్షాలు నా కక్కర్లేదు. థాంక్స్! వస్తాను మరి."

నిలువుగుడ్లతో నిలబడిపోయిన గంగా, మేరీల బృందాన్ని గమనించకుండానే చకచకా నడచిపోయింది మైథిలి.

# 4

"ఇతరుల దయాధర్మ భిక్షాలు అక్కర్లేదూ?" ఒక్కోమాటనే ఒత్తిఒత్తి పలుకుతూ అన్నాడు అభిమానం దెబ్బతిన్న ప్రసాద్. "వివరాలేమైనా తెలుసా?" అనడిగాడు మఱిలా పరివారాన్నంతనూ కలయజూస్తూ.

"ఓ! రెడీ, వివరాల పట్టిక." హనుమంతుడంత విశ్వాసం ఒలికించుతూ ఎగుటికి దూకి నిలబడ్డాడు గోపాలం. "తండ్రి బట్టలకొట్టులో గుమాస్తా. అతగాడి కుచేలసంతానంలో మధ్యస్థురాలు ఈ మైథిలీదేవి. అన్న ఒక చిన్నహోటల్‌లో టీ కప్పులు కడగకపోయినా యించుమించు అటువంటి ఉద్యోగమే చేస్తున్నాడు. శిథిలావస్థకు దగ్గరౌతున్న పెంకు టింటిలో నివాసం."

కామా, బిందువూ లేకుండా బడబడా చెప్పేసి,

చంద్రమండలయాత్ర చేసి వచ్చినంత సగర్వంగా అందరివేసా చూస్తూ కాలరు సర్దుకున్నాడు గోపాలం.

వింటూన్న ప్రసాద్ సాలోచనగా తల పంకించాడు, ఎటువంటి వ్యాఖ్యానమూ లేకుండా. అతడి చూపులు, వ్రేళ్ళమధ్య కాలిపోతూన్న సిగరెట్ పైననే కేంద్రీకృతమై వున్నాయి.

"పేదవాడికోపం పెదవికి చేటనీ - అడుక్కుతినేవాళ్ళ అభిమానా లెన్నాళ్ళు నిలుస్తాయిలే." కిసుక్కున నవ్వింది మేరీ. ఆమె వదనంలో కోపం, అసూయ పోటీపడ్తున్నాయి. "ఇంతకూ నువ్వు ఏమైనా ఆడేదీ పాడేదీ వున్నదా, అలా బుద్ధావతారంలాగా కూర్చుంటావా ?"

"ప్రసాదుపై తన కేదో ప్రత్యేకాధికారం వున్నట్లే చనవు ఒలికించుతుంటుంది మేరీ. "నువ్వలా పరధ్యానంగా కూర్చుంటే అసలు పిక్నిక్ రక్తే కట్టడం లేదు చూడు !" అనికూడా అన్నది విసుక్కుంటూన్నట్లుగా.

"అరె ! నాకేం పరధ్యానం ? రా, ఎందు కలా గోలపెడ్తావ్ ?" అంటూ పేకాటలో కలిశాడేకాని ప్రసాద్ మనసు మాత్రం అక్కడ లేదని అందరూ గ్రహించారు.

"గురూ! మన ప్రతాపం చూపించుదామేమిటి? పిట్ట దార్లోకి వస్తుంది." ఒక ఆశ్రితపక్షి అడిగాడు.

గుంభనంగా నవ్వాడుప్రసాద్.

"రాకేంచేస్తుంది?" కసి అంతా ఆటీన్ రాణీని విసర

డంలో ప్రదర్శించింది మేరీ. "ఆఫ్టరాల్, ఓ పేద గుమాస్తా గాడి కూతురు. నీ డబ్బుకు ఎవరు 'దాసోహం' అనరు గనుక? అనవసరంగా మా మతులు చెడగొట్టక చక్కగా గడుపు. నువ్వెంతసేపూ పురో ధోరణిలో వుంటే మా మతులు పోయి చస్తున్నాం."

"ఔనుగాని ఈ క్రొత్త స్నేహితురాలు వలలోపడ్డాక మాకు ఉద్వాసన చెప్పవ్ కదా గురో?" శోకాన్ని అభినయించాడు ఒకతడు.

నలుగురు కోరస్ అందుకున్నారు.

"ఏడిశారుగాని, నోళ్ళుమూయండోయ్." హుందాగా నవ్వేస్తూ అన్నాడు ప్రసాద్.

ఎవరెవరు తమ ధాటికిహడలిపోయి తమ ఆధిక్యాన్ని అంగీకరించి కాళ్ళ బేరానికివచ్చారో, ఎందరు అమ్మాయిలు తమ పీడ భరించలేక చదువులు మానుకుని పెళ్ళిళ్ళు చేసుకు వెళ్ళిపోయారో, ఎందరు లెక్చరర్స్ తమ బృందాన్ని ఏమీ అనకుండా ప్రాణాలు అరచేత పెట్టుకు బ్రతుకుతారో- గర్వంగా చెప్పుకున్నారు చాలాసేపు.

# 5

"గురూ! గురూ!"

తేలుకుట్టినట్లే ఉలికిపడిన స్నేహితుడి దెస ఏమిటన్నట్లు చూచాడు.

"అదుగదుగో......... ఆ వెళ్తూన్న సింగారి మైథిలి కాదూ?"

"ఓ!" ఉత్సాహంగా ఈలవేశాడు. "ష్యూరా. చూపించుదామేమిటి మన తడాఖా?"

"ఛలో, వేరే అడగాలా?"

ఒక చేతిలో పుస్తకాలు, మరొక చేతిలో కూరల సంచీతో నెమ్మదిగా నడుస్తున్న మైథిలి తన ప్రక్కనే ఆగిన కారునూ, అందు అస్పష్టంగా కన్పిస్తూన్న ఆకారాలనూ చూచి నిర్విణ్ణురాలైంది.

చీకటి పడబోతూన్నది. రాస్తా నిర్మానుష్యంగా లేకున్నా, ఎవరిదారిన వారు పోతున్నారు.

'ఏం జరిగితే మాత్రం ఎవరిక్కావాలి? ఎవరు పట్టించుకుంటారు?'

ఈ ఆలోచనతోనే మైథిలి గుండె ఆగినట్లయింది.

"మైథిలీ!"

ఎన్నో ఏళ్ళ పరిచయమూ, మరెంతో స్నేహమూ వున్నట్లుగా సంబోధిస్తూ కారు దిగి నిలబడ్డాడు ప్రసాద్.

ముచ్చెమటలు క్రమ్మిన మైథిలికి తల ఎత్తడమే భారంగా వున్నది.

"ఇలా ఎక్కడికీ, ఒంటరిగా?" అతి ఆప్యాయంగా పలుకరించాడు. కారులో నున్న తక్కిన ఘటాలు హేళనగా చూస్తున్నాయి.

"ఇక్కేనండీ మా ఇల్లు." ఎలాగో సమాధానం చెప్పింది.

మృదుస్వరంతో యిచ్చిన ఆ సమాధానం ప్రసాద్‌ను ఆశ్చర్యపరచింది. ఆనందంకూడా కలిగింది.

'నీ కెందుకు? నీదారిన నీవు ఫో. లేకుంటే అల్లరి చేయగలను; ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేస్తాను' వగైరా పెంకెమాటలు వినరావడమూ, వాగ్యుద్ధమూ తథ్యమని ఊహించుతూ, అటువంటి సన్నివేశం కొఱకు తయారై వచ్చాడతడు.

'నాకు కాకపోతే ఈ పట్టణంలో అమ్మాయిల అజాపజా కావలసిన మొనగాడింకెవడున్నాడు? నీ తల తిరుగుడు తగ్గించగల తడాఖా నాలో వుంది. కబడ్దార్!' అని కాలరు సవరించుకొని ఈల వేయడానికి అసలు అవకాశమే ఈయలేదు ఈ అమ్మాయి!'

అందువల్లనే ప్రసాద్ ఆలోచనలో పడ్డాడు కర్తవ్యం కొఱకు.

"అబ్బే... తెలిసినవారుకదా-ఒక్కరే శ్రమపడుతున్నారు, చేతిలో బరువుతో...పోనీ మా కార్లో దిగబెడదామని..."

తన స్వరం తనకే ఆశ్చర్యం గొలిపింది ప్రసాద్‌కు.

ఔను, అత డింత సరళంగా ఏ అమ్మాయితోనూ అంతకుపూర్వం మాట్లాడలేదు మరి!

"థాంక్సండీ. కాని, మీ కెందుకంత శ్రమ? నాకు అల వాటే యిలా పనులు చేసుకోవడం. అదుగో—ఆ ప్రక్క వీధి దుకాణంలో మానాన్నవుంటారు. అక్కణ్నుంచి ఇద్దరం కలిసే వెళ్ళిపోతాం, సెలవండీ మరి... చాలా థాంక్స్." రెండుచేతులూ ఎత్తి నమస్కరించి, తనదారిన సాగిపోయింది.

నివ్వెరపాటుతో నిలబడిపోయాడు ప్రసాద్. అమ్మా యిలు తననూ, తన బృందాన్నీ చూచి బెదరి పారిపోవడం రివాజు. కొంత గుండెధైర్యం వున్నవాళ్ళు పెంకెగా తిట్టి, మఱలా తిట్టించుకోవడం, ఆపైన మేష్టర్లకు ఫిర్యాదులు చేసి గొడవ చేయడమూ కద్దు. మేరీ వంటి వాళ్ళ వెంట అయితే తాను పడవలసిన పనేలేదు. మేరీ, గంగా వగైరా యువతు లందరూ తమంతతామే తనచుట్టూ తిరిగి వెకిలినవ్వులూ, వెట్టిహోయలూ ప్రదర్శించి, తాను కన్నెత్తి చూస్తేనే చాలన్నట్టు ప్రవర్తించి, ప్రస్తుతం తనవద్ద పెంపుడుకుక్కల దశలో వున్నారు.

ఈ పైమూడు రకాలలో ఏ రకానికీ చెందకుండా

కన్పట్టిన మైథిలి అతడి మెదడులో అప్పటికప్పుడు ఓ పెద్ద సమస్యగా పెరిగిపోయింది.

ఒక ఆడపిల్ల అంత సగౌరవంగా తనకు నమస్కరించడం జీవితంలో ప్రప్రథమంగా జరిగింది. అంత సున్నితంగా మాట్లాడడం, తనచేత సరసంగా మాట్లాడింపజేసి, తన వక్ర బుద్ధిని తాత్కాలికంగా మరపింపజేయడమూ ప్రథమంగానే జరిగింది.

"గురూ! మహామహా మొండి ఘటాలనే దారికి తెచ్చిన పీరుడవు—ఈ అతి మామూలు పిల్లముందు అలా అయిపోయావేం?" అంటూ సగం హేళనగానూ, ఆ అమ్మాయిని రకరకాలుగా ఏడ్పించే సదవకాశం కలుగనందుకు కొంత నిరుత్సాహంగానూ అడుగుతూన్న మిత్ర బృందానికి ప్రసాదు ఏమీ సమాధానం చెప్పలేదు.

మైథిలి మనసులో చెలరేగిన ఆశ్చర్యభావాలు కూడా తక్కువేమీ కాదు. ప్రసాదు గురించి చాలా విన్నది కళాశాలలో అడుగిడిన ఈ రెండునెలలలోనే. ఒక తరహా ఆడపిల్లలకు అతడంటే సింహస్వప్నం. "రౌడీ," "పొగరుబోతు," "డబ్బుతో కళ్ళు కప్పుకుపోయిన పశువు"- ఇత్యాది పదాలే వినవస్తాయి వారిమాటలలో ప్రసాదు నామానికి పర్యాయ పదాలుగా.

మేరీ బృందానికి మాత్రమే అతడు ఇంద్రుడూ, చంద్రుడూ, బీదలపాలిట కామధేనువూ.

అయినింటి ఏ ఆడపిల్లామాత్రం అతడిగురించి మంచిగా చెప్పదు, సజావుగా మాట్లాడదు.

అందుకే అతడు పలుకరించగానే తాను అంతగా బెదరిపోయి, వణకిపోయింది.

'కాని...పాపం, చాలా మన్ననగా, మర్యాదగా మాట్లాడాడే! ఏమో-కొందరికి అనవసరంగా చెడ్డపేరు వస్తుంది. పాపం. అయినా, నాకెందుకీ అనవసర తలపోతలు?'

## 6

"నన్నెంతే సాధిస్తావేకానీ, నువ్వెందుకు ధైర్యం చేయలేకపోయావ్ మరి? 'నువ్వెంత, నీ కారెంత?' అన్నట్లుగా తృణీకరించి వెళ్ళిపోయిందటగా నిన్న నీ ఆరాధ్య దేవత?"

మేరీవిసిరిన సవాలుకు పౌరుషంగా తలెత్తాడుప్రసాదు. అతడిని కవ్వించాలనే మేరీ ఉద్దేశ్యంకూడా. పరువులేకుండా పరదయాధర్మాలపై ఆధారపడి బ్రతుకుతూన్న ఆమెకు నీతి నియమాల మధ్య గౌరవంగా జీవించేవారిపైఎనలేని ఈర్ష్యగా వుంటుంది. అటువంటివా రెవరికైనా గౌరవభంగం కలిగిన నాడు ఆమె పండగే చేసుకుంటుంది!

"ఆ రోజు పిక్నిక్ ప్రోగ్రాంకు రమ్మంటే రాలేనన్నది, ఈరోజు 'మాతో సినిమాకు వస్తావా?' అనడిగితే 'నాకు

అటువంటి తిరుగుళ్ళకి పర్మిషన్ లేదు; మా నాన్న చీరి ఎండే స్తారు' అన్నది నిర్మొహమాటంగా. అదే మహా పతివ్రత?" రోషంగా బుసలుకొట్టింది. "ఈ ఆదివారం నీతో సినిమాకు తీసుకురా చూస్తాను ప్రతాపం!" అనికూడా అన్నది.

"సరే, చూద్దురుగాని" అన్నాడు ప్రసాదు తలెగరేసి.

మిత్రులందరి నడుమా చేతకాని వా డన్పించుకోవటం అతడి యింతకాలపు పేరు ప్రతిష్ఠలకూ అవమానంకాదూ?

# 7

తల ఒంచుకుని రోడ్డుకు ఒక ప్రక్కగా నడుస్తూన్న మైథిలి వెనుకనుంచి తన పేరుతో సన్నగా ఎవరో సంబోధించి నట్లు విన్పించి, తిరిగి చూచింది. ప్రసాదు, అతడి స్నేహితు లిద్దరూ ఒక దుకాణంవద్ద నిలబడి వున్నారు ఏదో బేర మాడుతూ. కాని ఎవ్వరూ ఇటు చూడటంలేదు. వారసలు మైథిలిని గమనించినట్లే లేదు.

'నా భ్రమ అయివుంటుంది.' అనుకొంటూ వెనుదిరి గిన మైథిలికి మరలా అలాగే విన్పించింది, వెన్నంటి ఈలలు.

గ్రహించింది మైథిలి. ఈనాడు తప్పక తన భరతంపట్టా లనే ప్రసాద్ నిర్ణయించుకున్నాడన్నమాట! ఏది దారి?

గబగబా అడుగులు వేయసాగింది, అదిరే గుండెలతో.

చిన్న తనకు కొద్ది దూరంలో కూర్చుని తనకు విన్పిం

చేలా మేరీ, గంగా, జయా వగైరా మేళమంతా ప్రసాదు స్తోత్రగానం చేస్తూంటే విన్నది.

కొందరు అమ్మాయిలు ప్రసాదుకు భయపడి చదువు మానుకుని, పెళ్ళిళ్ళు చేసుకుని పారిపోయారట.

కొందరికి పెళ్ళిళ్ళుకూడా కాకుండా ప్రసాదు సాయ శక్తులా కృషిచేసి అడ్డుపడ్తున్నాడట. ఇటు చదువుకూ, అటు పెళ్ళికీ కూడా చెడి ఏడుస్తున్నారట ఇళ్ళల్లో క్రుగ్గుతూ.

ఇదంతా ప్రసాదు ఆదేశానుసారంతనకుబుద్ధిపూర్వకంగానే విన్పించిన పరోక్షమైన హెచ్చరిక కాదుగదా! ఈరోజు ప్రసాదు ఏం చేయ సమకట్టాడో?

"మైథిలీ !"

భయపడిన భయంకర క్షణం అసన్నమవ్వనే అయింది.

ప్రసాద్ స్వరం సరళంగానే పలికినా మైథిలికి పిడుగుపాటులా తోచి మేను కంపింపసాగింది.

భయంతో నడక ఆగిపోయి నిలబడిపోయింది. ఆమె కనులలోని భయకంపన గమనించిన ప్రసాద్ గర్వంగా నవ్వుకున్నా, నిర్మలంగా — వెకిలితనం ఏమాత్రమూలేని చక్కటి గౌరవ తరహాలో కన్పిస్తూన్న మైథిలిని చూడగానే అతడి లోని అల్లరి స్వభావం అణగి పోతూన్నది; పొగరుబోతు భావాలు తల దించుతూన్నాయి. ముందునుండీ ఆలోచించి పెట్టుకున్న మాటలూ, పథకమూ మఱపుతగులుతున్నాయి.

మొన్నా అలాగే జరిగింది; నేడూ అలాగే జరిగింది.

"రోజూ... ఈ టైములో ఎక్కడి నుండి వస్తూంటారు? చేతిలో ఆ పెద్ద సంచీ..."

అల్లరివాటంగా లేని ఆ ప్రశ్న మైథిలి గుండెదడను తగ్గించింది.

"కాలేజీ టైము తర్వాత మూడు ఇళ్ళల్లో ట్యూషన్స్ చెప్తాను. అప్పుడప్పుడు ...ఆ ఇళ్ళవారు తమకు కలిగినది పళ్ళో - కూరలో యిస్తుంటారు."

"పాపం... చాలా శ్రమ పడ్తారన్నమాట మీరు?"

"బీదవాళ్ళం... నేనేకాదు మా ఇంట ప్రతి ఒక్కరూ తమ తమ శక్తి మేరకు శ్రమపడ్తారు."

ఈ ఇష్టాగోష్ఠి అయిష్టంగా వున్నట్లు సూచనగా వెనుక నున్న ప్రసాదు స్నేహితుల సకిలింపులు వినవచ్చాయి.

అప్పుడు ప్రసాదుకు కర్తవ్యం స్ఫురణకు వచ్చింది.

'బీదవాళ్ళం అనుకుంటూ కూర్చోకుండా ఐశ్వర్యం అందుకోవటానికి ప్రయత్నించరాదా?' అని చమత్కరించా లనుకున్నాడు కాని అనలేకపోయాడు.

"వెళ్తానండీ. మా నాన్నకు జ్వరంగా వుంది." అన్నది మైథిలి ఆత్రతను వ్యక్తీకరిస్తూ.

"అయ్యో, చెప్పరేంమరి? ఇంటివరకూ ఒక్కరే వెళ్ళాలిగా, చేతిలో ఈ బరువుతో? పదవండి ఇంటివద్ద దిగ బెడతాను మా కార్లో."

"ఆఁ, ప్లీజ్! చాలా థాంక్స్, ఒక్కతెనూ ఈ నిర్జన మార్గంలో భయపడుతూ నడుస్తూంటే మీరు ఆపద్బాంధవు నిలా ఆదుకున్నారు!"

తల తిరిగినట్లే అన్పించింది ప్రసాదుకు, ఆమె తన సహాయాన్ని ఆనందంగా అంగీకరించింది. ఆహా! ఏమి సుదినం!

"రండి. అదుగో కారు ఆ దుకాణం దగ్గరున్నది."

అతడు ముందు గబగబా నడిచాడు కారువద్దకు, మైథిలి మెల్లగా అనుసరిస్తూండగా.

విషయంవిన్న స్నేహితులు ఆనందం ప్రకటించారు. "కంగ్రాట్స్! మేం సెలవు తీసుకుంటాంమరి!" అని కారు దిగిపోయారు.

"ఒరేయ్! ఇంటికి తీసుకెళ్ళి ఏ అన్నచేతనో, తండ్రి చేతనో పాఠం నేర్పించగలదేమో! జాగ్రత్త!" ఒకతడు హెచ్చరించాడు ప్రసాదును.

ప్రసాదు పౌరుషంగా అన్నాడు; "నోర్ముయ్యరా చవటా! నేనెవర్ని? పట్టణంలోకెల్లా ధనవంతులైన రావుగారి ఏకైక పుత్రుణ్ని! పేరు వింటూనే ప్రతివాళ్లూ గడగడ వణకేట్లు చేయగల ప్రసాదుని."

స్నేహితులు తమదారిన వెళ్ళిపోయారు.

'ఈ గుడగుడలూ, గూడుపుఠానీ ఏమిటో అర్థంకాక బెదురుతూ సంకోచంగా అల్లంతదూరాన నిలబడిపోయిన

మైథిలిని సాదరంగా "రండి" అని పిలుస్తూ ఫ్రంట్ డోర్ తీశాడు ప్రసాదు.

"వెనుక కూర్చుంటాను లెండి." బిడియంగా అన్నది.

"మీ యిష్టం."

"ఏమిటీ, బొత్తిగా మౌనంగా కూర్చున్నారు? ఏమైనా మాట్లాడండి. ఏమిటీ ఆలోచిస్తున్నారు?"

"ఏమీ లేదు, నా దుస్తులూ, ఈ నా చేతిసంచీ - వీటి మురికివల్ల తళతళలాడే కారుసీట్లు మాసిపోతాయేమోనని భయంగా వున్నది."

తన తాహతును అంత స్పష్టంగా అంగీకరించిన ఆమె నిజాయితీని లోలోన మెచ్చుకోకుండా వుండలేకపోయాడు ప్రసాదు.

"పాపం - కాలేజీనుంచి వస్తూనే ట్యూషన్స్ చెప్పడం అలసటగా వుండదా?" మాటలలోకి దింపాడు.

"లేదు లెండి. అలవాటైపోయింది. మా నాన్న ఒక బట్టలకొట్టులో గుమాస్తా. మా అన్న ఒక హోటల్లో మానేజరుకు కాస్త సహాయంగావుండే చిన్నపని చేస్తున్నాడు. చదువుకొంటూన్న తమ్ముళ్ళిద్దరున్నారు. అంచేత నేను కూడా చేతనైనంత కుటుంబానికి సహాయం చేయాలని...రెండు ట్యూషన్స్ చెప్తున్నాను. నెలకు అరవై వస్తాయి."

"ఐ సీ!" అంటూ ఆ తర్వాత మాటలకోసం ఆలోచించసాగాడు.

ఇటువంటి ఏకాంతం దొరకగానే వనపిట్లల్లాగా వాగుడూ, తనను ఆకర్షించటానికీ, వశపఱచుకోవటానికీ అసలే చవకబారుగా వుండే వస్త్రధారణను మరింత హీనగతికి మార్చుకోవడమూ, వెకిలి హొయలు ఒలికించడమూ చేస్తారు చాలమంది యువతులు.

కాని, ఈమె గువ్వలాగా ముడుచుకుపోయి కూర్చున్నది. మాట్లాడిన రెండు మాటలూ చాలా పొందికగా, మన్ననా గౌరవాలు వుట్టిపడేట్లు మాట్లాడ్తోంది.

అల్లరి రకాలను అవలీలగా మచ్చిక చేసుకోవచ్చు. అతిసవ్యంగా, సరళంగా, హుందాగా వుండే వాళ్ళతోనే చిక్కంతా.

"ఇటండీ ... ఈ సందులో ..."

మైథిలి దారి సూచించిన ప్రకారం, శిథిలావస్థకు కొద్ది పూర్వస్థితిలోనున్న పెంకుటింటిముందు ఆగింది కారు.

ఇల్లు చిన్నదే.

ఆ వీథి అంతా యించుమించు అటువంటి కొంపలతోనే నిండి వున్నది. ఇళ్ళ గుమ్మాలను ఆనుకొనే మురుగు కాల్వ ప్రవహిస్తోంది.

ఆ వీథిలోని ప్రతి ఇల్లూ, ప్రతి సందూ అతడికి పరిచయమే అయినా, ఈరోజు మాత్రం ప్రసాదు మనసులో ఏమిటో క్రొత్తతరహా ఆలోచనలు వస్తున్నాయి.

"రండి లోపలికి" తాను ముందుదారి తీస్తూ అన్నది మైథిలి.

"అక్కయ్య కారులో వచ్చింది. బలే! బలే!" అంటూ లోనుండి ఇద్దరు మాసిన బట్టల పిల్లలు బయటికి వచ్చారు.

దైవం దిగివస్తే చూచినట్లుగా చూస్తున్నారు వాళ్ళు ప్రసాదునూ, అతడి వాహనాన్నీ.

"నేను వెళ్తానులెండి." మొహమాటంగా అన్నాడు ప్రసాదు.

"రెండునిముషాలు కూర్చుని వెళ్ళండి. వీథిలోనుంచే వెళ్ళిపోతారా మరీనూ?" అర్థింపుగా అన్నది మైథిలి.

సంతోషంగా ఆమెను అనుసరించాడు ప్రసాదు లోలోన తరహా తరహాలుగా ఆలోచించుతూ. 'ఇంత చనువుగా లోనికి రమ్మంటూన్నదంటే ఘటికురాలే! పెద్దవాళ్ళు ఏమీ అనరన్నమాటేగా? ఇన్ని రోజుల నాటకమూ కేవలం బెట్టుసరి అన్నమాట!'

"అన్నయ్య యింకా రాలేదా?" తమ్ముళ్ళనడిగింది మైథిలి.

"లేదు. మాకు ఆకలిగా వున్నది. నాన్న అలాగే పడుకుని వున్నారు." బిక్కముఖాలతో చెప్పారు వాళ్ళు.

"వచ్చేశానుగా? అన్నం వండుతాను కాని...ఈ సంచిలో పళ్ళున్నాయ్. తీసుకు తినండి."

వాళ్ళు ఆశగా సంచిమీాదపడి వస్తువులు బయటకు లాగి తినసాగారు.

"వచ్చావా ?" మూలుగుతూన్న తండ్రికంఠం విన్పించింది ప్రక్కగదిలో నుండి.

"ఇంత ఆలస్యంగానా ఆడపిల్ల ఇల్లు జేరడం ? ఎన్ని సార్లు చెప్పాను నీకు ?" శక్తినంతనూ కూడదీసుకుని అరుస్తు న్నాడు వృద్ధుడు.

"ఏంచేయను నాన్నా ? ట్యూషన్స్ చెప్పేచోట ఆలస్యమైపోయింది. వాళ్ళచేత ఓపికగా అన్నీ చదివించక పోతే మరో టీచర్ని పెట్టుకుంటారు" అనునయంగా సమాధాన మిస్తోంది మైథిలి.

"ఇంతకూ నా ఖర్మ! పెళ్ళి కావలసిన ఆడపిల్లకూడా శ్రమపడవలసి వస్తోంది, ఈ దిక్కుమాలిన సంసారంకోసం" నుదురు కొట్టుకుంటూన్న అతడి చేతులను పట్టుకొన్నది మైథిలి.

"ఏమిటి నాన్నా ! రోజూ యిది ? అన్నయ్యా, మీారు శ్రమపడ్డట్లే నేనూ పడ్తున్నాను. కనీసం నా చదువు ఖర్చు కొట్టుకుపోతోంది నా ట్యూషన్స్‌తో. అంతే— మీాకేం చేయగల్గుతున్నాను ? ఈరోజెలా వుంది ? జ్వరం రాలేదుగా ?"

"రాలేదమ్మా. చాలా ఆకలిగావుంది."

"పావుగంటలో వండిపెట్టేస్తాను... ఒరే గోపీ, రెండు

బత్తాయిపళ్ళు వలిచిపెట్టు నాన్నకు" తమ్ముడిని తండ్రివద్ద కూర్చోబెట్టి తలుపుజేర్లవేసి బయటకు వచ్చింది మైథిలి.

ఎమటిగదీ, వంటగదీ, ప్రక్కగదీ— అంటూ నామ కార్థమే కాని అన్నీ కన్పిస్తూనే వున్నాయి గుమ్మంవద్దనే నిలబడి చూస్తూన్న ప్రసాదుకు.

"నాన్నా! అక్క పెద్దకారులో వచ్చింది తెలుసా?" గోపీ సంబరంగా చెప్తూన్న వార్తతో ఇల్లు ప్రతిధ్వనించింది.

ఆ వెనువెంటనే మరింత బిగ్గఱగా వినవచ్చింది ముసలాయన గొంతు. "మైథిలీ!!"

"ఏంనాన్నా?" జేరవేసిన తలుపు తోసుకుని మఱలా లోపలికి వెళ్ళి అడిగింది మైథిలి.

"ఎవరిదో కారులో వచ్చావట? ఏమిటీ వేషాలు?" నిప్పులు రాల్చే కనులతో అడుగుతున్నాడు. "ప్రొద్దుపోయిందని... డాక్టరుగారిభార్య వారి కారులో పంపారు దయతలచి. వాళ్ళమ్మాయిలకు బాగా చదువు చెప్తున్నానని ఆవిడకు అభిమానం నేనంటే." ఈ అబద్ధం ఆడుతూ ఒక్కసారి ప్రసాదు దెస చూచింది.

అతడు అపరాధిలా తలవాల్చుకున్నాడు.

"వాళ్ళ కార్లూ, మేడలూ వాళ్ళకే వుండనీ, మన హద్దుల్లో మనం వుండాలి. మనకున్న ధనం మానమర్యాదలే. అవి లేనినాడు గుప్పెడు ఎలుకలమందే గతి కుటుంబం అందరికి. తెలిసిందా?"

"తెలుసు నాన్నా!" తల వాల్చుకుని మెల్లగా అన్నది.

"కార్లూ మేడలూ చూపి వలలో వేసుకోవడమే కొందరికి వచ్చిన విద్య. మన జాగ్రత్తల్లో మనం వుండాలి. పోనీ ట్యూషన్స్ మానేయి, కాని యింటికి ఆలస్యంగా రాకు. నువ్వు యిల్లు జేరేవరకూ నాకు మతి వుండదు."

"అలాగే, రేపు మాట్లాడుకుందాం. ఇప్పు డేం జరిగిందని జ్వరంతో అంత అలసిపోయి మాట్లాడడం? వంట చేస్తాను. ఆలస్యమైపోతోంది." తిరిగి తలుపులుమూసి బయటకు వచ్చింది.

శిలాప్రతిమలా నిలబడి చూస్తూన్న ప్రసాదువద్దకు వచ్చింది మైథిలి మెల్లగా.

"మీవంటివారిని కూర్చోమని మర్యాద చేయగలశక్తీ, తాహతూ లేని బీదవాళ్ళం. ఇటువంటిచోట మీకు మతి పోతుంది. వెళ్ళిరండి." అన్నది రెండుచేతులు జోడించుతూ, "రేపు ఒక్కసారి... ఒక్క పది నిముషాలు మాట్లాడే అవకాశ మీయండి" అన్నది తిరిగి అర్థింపుగా.

తన చెవులను తానే నమ్మలేక పోయాడు ప్రసాదు. "ఓ! తొమ్మిదింటికే వచ్చేయండి రేపు కాలేజీకి. సైన్స్ లాబొరేటరీ ప్రక్కన మీకోసం ఎదురు చూస్తూంటాను." ఆనందంగా వెళ్ళిపోయాడు ప్రసాదు.

కాని, అతడి మనస్సులో ఏమిటో ముల్లుగ్రుచ్చు కొన్నట్లుంది ఈనాడు.

బీదరికం చాలా ఘోరంగా వుంటుందని చదవటమూ, చిత్రాలలో చూడడమే కాని ఎప్పుడూ అంత సన్నిహితంగా పరికించడం జరగలేదు. ఈనాడు మైథిలి కారణంగా ఆ దరిద్రస్థితిని కళ్ళారా చూడడం జరిగింది.

"అబ్బ! ఎలావున్నవి ఆ యిల్లూ, ఆ పరిసరాలూ. ఇంట చూడటానికి ఏ వస్తువూ కన్పించలేదు. చదువు కుంటోంది- ట్యూషన్స్ చెప్తోంది- ఆ తర్వాత యింటిచాకిరీ చేస్తోంది. ఎంత శ్రమజీవి! అయినా, తండ్రిచేత చీవాట్లు తిన్నది పాపం నా కారణంగా. నాగురించి అబద్ధం కూడా ఆడింది. ఎంతటి సహనం! మైథిలివంటి ఆడపిల్లను నేను యింత వఱకూ కలుసుకోలేదనేది యదార్థం! దరిద్రమున్న తావున నిలబడి కంటితో చూడడమే నాకు కష్టమన్పించింది. మరి ఆ హైన్యాన్ని సహించడం ఎంతటి ఓర్పుకూ, బుద్ధికీ నిదర్శనం! ఆమె, ఆమె కుటుంబమూ ఆ దారిద్ర్యాన్నే అనుభవించు తున్నారు కాని, దానినుండి పారిపోవడానికి అడ్డదారులు వెతకడంలేదు... అయితే, రేపు మైథిలి నాతో ఏమిమాట్లాడ దలచుకున్నది? ఈ దరిద్రంనుండి దూరంగా తీసుకు పొమ్మం టుందా?

# 8

ఎదురుచూచిన క్షణం ఆసన్నమైంది.

దూరంగా నడచి వస్తూన్న మైథిలిని చూచి ఉత్సాహంగా ఈల వేయలేక పోయాడు ప్రసాద్. ఎందుకో గుండె వేగంగా స్పందించసాగింది. ఇదొక క్రొత్త అనుభవం అతడికి.

"రండి, అలా కూర్చుని మాట్లాడుకుందాం ఆ చెట్టు క్రింద." అన్నాడు.

"వద్దండీ! పెద్దమాటలేమున్నాయిగాని...నిన్న...మా ఇంటి పరిస్థితి చూశారుకదా?"

"ఊఁ"

"మా నాన్నకు మేము అయిదుగురం సంతానం. ప్రస్తుతం నల్గురిమే. ఆ కుటుంబానికి నేనే ఆడదిక్కును."

"మీ అమ్మగారు."

"ఏడాదిక్రితం మరణించింది. ఎమ్మే చదివిన మా పెద్దన్న మరోజాతి యువతి ప్రేమలో పడి, మా నాన్నగారు వివాహానికి అంగీకరించని కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ బెంగతోనే మా అమ్మా గతించింది. ఇక ఆ ఊళ్ళో బ్రతకలేక ఇక్కడికొచ్చాం ఈ ఏడు. ఇది ఎందుకు చెప్పానంటే పరువు అనే పదమూ మా కుటుంబమూ ఎంత సన్నిహితులో మీకు తెలియాలని!"

ఉలికిపాటుతో చూచాడు ప్రసాద్.

"ప్రసాద్‌గారూ!" గంభీరంగా సంబోధించింది. "మీకు ఎందరో గొప్ప గొప్ప స్నేహితురాళ్ళున్నారు; ఇంకా దొరుకుతారు. మరి నావంటి సాధారణురాలి స్నేహం మీరెందుకు కోరుతున్నారో నాకు తెలియదు. మీ స్నేహం తృణీకరించితే, మీ మాటకు దాసోహ మనకపోతే ఈ ఊళ్లో ఆడది బ్రతకలేదనీ, ఎన్నో అనర్థాలు కలుగుతాయనీ మీ స్నేహితురాలు మేరీ నన్ను చాలాసార్లు హెచ్చరించింది"

"లేదే! నేను అదేమీ ఎరుగనే?" ఖంగారుగా అన్నాడు ప్రసాద్.

మైథిలి తన మాటలు పొడిగించింది. "ఔను. నేను మాత్రం ఆ మాటలు నమ్మలేదు. కారణం మీరు నాతో ఎప్పుడు మాట్లాడినా ఎంతో మన్ననగా, మర్యాదగా, సానుభూతిగానే మాట్లాడడం నేను గమనించాను. మీపై నాకెటువంటి అపోహా లేదు. లోకులమాటలు నేను నమ్మడం లేదు."

"థాంక్స్"

"మీరెంతో ధనవంతులనీ, మీరు నడిపే సంస్థలలో మావంటివారు వేలాదిమంది బ్రతుకుతున్నారనీ కూడా వినివున్నాను. అందరికి బ్రతుకు తెరువు చూపించిన మీరు మా వంటివారి బ్రతుకులలో నిప్పులు పోయరనే నమ్మికతోనే నిన్న ధైర్యంగా మీ కారులో కూర్చుని మిమ్మల్ని ఇంటికి తీసుకెళ్ళి నా పరిస్థితిని చూపాను...మీరు సహృదయంతోనే

నన్ను పలుకరించి వుండవచ్చు సానుభూతితో. కానీ, అంతటి అదృష్టత నాకు లేదు. ఈ సంఘోద్ధారకులంతా ఏదైనా చక్కటికథ అల్లి ప్రచారం చేశారంటే మా కుటుంబమందరికీ ఈ ఎలుకలమందు తిని చావాల్సిన రోజు వస్తుంది. ఈరోజే బజారులో కొన్నాను ఎందుకైనా మంచిదని." చేయిచాపి పొట్లాం అతడికి చూపింది.

"మైథిలీ!" అంతకంటె మాట్లాడలేకపోయాడు.

"నా పరిస్థితినంతనూ మీకు వివరించాను. ఇక తర్వాత మీ నిర్ణయం — మీ ఇష్టం. మీకు నాపై ఏమాత్రం సానుభూతివున్నా ఇక నన్ను వెంటాడటం, మాట్లాడటం మాని వేయండి. నేను బ్రతకటానికి చదువుకుంటున్నాను కాని, కాలక్షేపానికి కాదు."

అతడి మాటలను మరి వినకనే గబగబా నడచి పారిపోయినట్లే అదృశ్యమైంది.

దూరదూరంగా నిలబడిన స్నేహితులంతావచ్చి చుట్టుముట్టి ప్రశ్నలు కురిపించారు.

"ఏం గురూ! ఆఖరికి సాధించావే!"

"ఇంతసేపు ఏం కబుర్లు చెప్పింది? కాస్త మాకూడా విన్పించుదూ."

"పార్టీ ఎప్పుడు?"

అందరికీ ప్రసాద్ గంభీరమౌనమే సమాధానమైంది. ఏమీ 'అర్థంకాక' ముఖముఖాలు చూచుకున్నారు.

# 9

"ఈరోజు ప్రసాద్ యింట ఏదో బ్రహ్మాండమైన పార్టీ అట. మనందర్నీ తప్పక రమ్మనమని మరీ మరీ చెప్పాడు."

ప్రసాద్ కుడిభుజమైన గోపాల్ వార్త అందించేసి వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు "ఇంకా బోలెడు మందిని పిలవాలి" అంటూ.

"ఏమిటీ ! !"

ఆశ్చర్యపూరితమైన ప్రశ్న అందరి కంఠాలనుండీ ఒకే సారి వినవచ్చింది.

"మనకు తెలియకుండా ప్రసాద్ ఇంట విందులూ, వినోదాల ఏర్పాటూ ఏనాడూ జరగలేదే! ఇదేమిటీ?" మేరీ ఆశ్చర్యంగా అన్నది.

"వారంరోజులుగా ఊళ్ళోనే లేడుగా అసలు? కుటుంబం అందరూ తిరుపతి వెళ్ళారని నౌఖరు చెప్పాడు. మరి ఎప్పుడు వచ్చాడు? ఈ ఏర్పాట్లెప్పుడు జరిగాయీ?" రామం ఆశ్చర్యంగా అన్నాడు.

"ఎందుకలా బుర్రలు బద్దలు కొట్టుకుంటారు? అది మన యువతీ యువకులు ఏర్పాటుచేసే విందు కాదన్నమాట! లేకుంటే తప్పక పిలిచేవాడేగా?" గంగ తేలికగా అనేసింది.

"మరి ఇప్పుడు పిలిచాడుగా ఏదో క్రొత్తవాళ్ళను క్రొమొక్కుబడిగా పిలిచినట్టు?" మేరీ మాటలలో కోపం.

"మా హిందువులలో తిరుపతి వెళ్ళి వచ్చినవాళ్ళు ఏదో దీపారాధన అని చేసుకుంటారులే ముసలి చాదస్తులు. భోజనాలవీ పెట్టుకుంటారు. ఏ అమ్మమ్మో నాయనమ్మో పుణ్యం సంపాయించే తాపత్రయంలో వున్నారేమో!"

"నాకు తెలిసినంతవరకూ అతడింట అలాంటి ముసలాళ్ళెవరూ లేరు. అతడూ, తల్లీ, తండ్రీ. అంతే."

"సరే, వెళ్తాంగా? అప్పుడే తెలుస్తుంది."

"ప్రసాద్‌ను చెవిమెలేసి మరీ అడుగుతాను, ఊరినుంచి రాగానే మా యింటికి ఎందుకురాలేదో. అసలీమధ్య ఏమిటో చాలా మారిపోతూన్నట్లు కన్పిస్తున్నాడు ప్రసాద్." తన ప్రాముఖ్యత ఎంతగానో తగ్గిపోయినట్లుగా అక్కసుగా అన్నది మేరీ.

"మరి లోగడ ప్రసాద్ ఏ పార్టీ యిచ్చినా, అందు ఏమేమి పదార్థాలు 'సర్వ్' చేయాలీ, ఎవరెవర్ని ఆహ్వానించాలి—వగైరా ముఖ్యాంశాలన్నీ తనతో సంప్రదించి తన సలహాల ప్రకారమేగా జరిపించేవాడు!"

అయితే మేరీ ఆమె మిత్రులూ ప్రసాద్ గృహ ప్రాంగణంలో అడుగిడుతూనే గ్రహించారు అది సాధారణమైన విందు కాదని, విచిత్రమైన విద్యుద్దీపాలంకరణతో, అసంఖ్యాకమైన ఆహ్వానితులతో, అంగరంగ వైభోగాలు

వెదజల్లుతూ ఎవరిదో వివాహం జరుగుతూన్నంత నేత్ర పర్వంగా వున్నది.

'సందర్భం ఏమిటైవుంటుందీ?'

నౌకర్లని అడుగుదామంటే మహా హడావిడిగా తిరుగు తున్నారు.

తమను పలుకరించి మర్యాద చేసే వారే కానరాక ఒక్కప్రక్కగా నిలబడి చూస్తున్నారు, ఆ కోలాహలమంతా!

ఆహ్వానితులు కొందరు కొందరు ఒకచోట చేరి మాట్లాడుకుంటూన్న మాటలలో చెదురుమదురుగా ప్రసాద్ ఉదారస్వభావ శ్లాఘతా, అతడి తలిదండ్రుల కీర్తిగానమూ వినవస్తూన్నవి.

అందరికంటె మేరీకి ప్రాణసంకటంగా వున్నది. ఆమె మనసు కీడును శంకిస్తూన్నది.

"ఏమండీ వదినగారూ!" ఎవరో ఒక ధనిక స్త్రీలాగా వున్నది వేష భాషలలో, గృహిణిని చనువుగా పలుకరిస్తూ న్నది: "ఒక్కగా నొక్క కొడుకు, మీరా కోటీశ్వరులాయె, ఇంత గప్ చిప్ గా తిరుపతిలో పెళ్ళిచేసి తీసుకొచ్చారేమిటి?"

"ఆమె ప్రసాద్ తల్లిగారు." అంటూ మేరీబృందం ఒకరితో ఒకరు చెప్పుకుంటూ, ఆమెగారు చెప్పబోయే సమా ధానం కోసం ప్రాణాలు బిగబట్టుకు చూడసాగారు.

"ఔనండీ. ఒకే ఒక్క బిడ్డ కావడం వల్లనే వాడు ఆడింది ఆటగా పెంచాము. తనే యిష్టపడి నిర్ణయించు

కున్నాడు. వాళ్ళ కాలేజీలోనే చదువుతోందట—చాలా బీద కుటుంబం. ఏంచెయ్యనూ? వాడి ముచ్చట తీర్చలేని ఐశ్వర్యం ఎందుకూ? అయినా మాకున్నది చాలకనా ఒకళ్ళివ్వడం? పిల్ల లక్షణంగా పేరుకు తగ్గట్టే సీతామహాలక్ష్మిలాగా, చాలా బుద్ధిమంతురాలు. సంసారపక్షంగా వుంటుంది... అయితే వాళ్ళు మరి మనకు తగట్టు పెళ్ళిచేయలేరు పాపం. అందుకే పెళ్ళి తిరుపతిలో చేసేశాం."

ఆమె మాటలు పూర్తి చేస్తూనే, మేడమెట్లదెస చూస్తూ "అదుగో అబ్బాయీ, కోడలూ!" అన్నది మురిపెంగా.

"నిజంగా లక్ష్మిలాగే వున్నదండీ..."

ఇక ఎవరిమాటలూ విన్పించటం లేదు తల తిరిగిపోతూన్న మేరీకి.

ఖరీదైన దుస్తులలో హుందాగా మేడమెట్లు దిగి వస్తూన్న పెండ్లికుమారుడు ప్రసాద్, సరసనే నవవధువు మైథిలి! జరీపూలచీరతో, వజ్రాలనగలతో, నుదుట కళ్యాణ తిలకం, పాదాలకు పారాణితో, నునుసిగ్గుతో, తలవాల్చుకుని ఒక్కొక్క మెట్టే మెల్లగా దిగుతూన్నది.

చేయీ చేయీ కలిపి నడుస్తూన్న ఆ జంట వెనుక యిద్దరు దాసీలు!

కలనైనా ఊహించని ఈ సంఘటన కనుగ్రుడ్లు నిలబెట్టే అవాక్కుగా చూచేట్లు చేసింది ప్రసాద్ స్నేహబృందాన్ని.

'ఎంత అవమానం!' గిరుక్కున తిరిగిపోవాలనుకున్నది మేరీ, కాని, భూమికి అంటుకుపోయినట్లుగా కాళ్ళు కదలవేం?

అంతలో వారందర్నీ చూచిన ప్రసాదు "హల్లో!" అంటూ గబగబా సమీపానికి వచ్చాడు.

దాసీలు ఎంతో వినయంగా ఒకరు జడ సర్దుతూ, మరొకరు చీరకుచ్చెళ్ళు సవరించుతూ సోఫాలో కూర్చుండబెట్టారు నవవధువును. వంటిమీద తేళ్ళు ప్రాకుతూన్నట్లున్నది మేరీకి ఆ దృశ్యం.

'ఏమీ ఎరుగనిదానిలా తలఒంచుకుపోయే నీవు ఎంత పనిచేశావే మైథిలీ! మా అందరికంటెదగ్గరదానవైపోయావా ప్రసాదుకు? ఎంత నంగనాచివి!"

లోలోన కారాలూ, మిరియాలూ నూరుతూ ఆలోచిస్తూన్న ఆమె ప్రసాదు వచ్చి పలకరించడంతో బలవంతంగా చూపులు యిటు త్రిప్పింది.

ఆ చూపులలో ఎనలేని కోపం, దుఃఖం, జుగుప్సా, ద్వేషం పోటాపోటీలుగా వురుకుతున్నాయి.

"ఏమిటి గురూ ఇది?"

"వండ్రఫుల్! ఎవ్వరం ఊహించనైనా లేదు."

"మేము వినడానికికూడా తగమా?"

స్నేహితులంతా రకరకాల ప్రశ్నలు కురిపించసాగారు.

"షైము లేదురా. అలా జరిగిపోయింది." అంటూ సరసంగా జవాబులిస్తూన్న ప్రసాదు చూపులు మేరీపైన నిలచిపోయాయి.

ఆమె కన్నులలో కురుస్తూన్న అసూయను చూచి నవ్వుకున్నాడు ప్రసాదు. "కూర్చోండి అంతా. నిలబడ్డారేం? రా మేరీ. ఇలా కూర్చో." సాదరంగా అన్నాడు.

"చాల్లే మర్యాద !" ఉరిమింది మేరీ. "కొంచెం అలా నడు, నీతో మాట్లాడాలి."

అలవోకగా నవ్వాడు ప్రసాదు. "నువ్వు మాట్లాడబోయే విషయం నాకు తెలుసు !"

"ఓ !" కళ్ళు విచిత్రంగా త్రిప్పింది. "మాతో మాట్లాడడానికే ఝడుస్తున్నావే ? అప్పుడే పెళ్ళానికి భయపడడం మొదలైందా ? ఆఫ్టరాల్ – నువ్వూ మామూలు మగాడివేనన్నమాట ?"

ప్రసాదు చిరునవ్వు నవ్వాడు. "కవ్వించి లాభంలేదు మేరీ. పాత విషయాలు మఱచిపో."

"ఎంత తేలిగ్గా అంటున్నావ్! ఔనులే. ధనవంతుడివి కదూ ? నీవన్నదే మాట. నీవాడినదే ఆట !"

"మేరీ ! నువ్వింత బాధపడి సణగవలసినదేమున్నది యిందులో ?"

"ఎంతటివాడవు ! మా అందరితో వేసిన వేషాలన్నీ ఏమిటి మరి ?"

ప్రసాదు గంభీరంగా మారిపోయాడు, "మేరీ ! నాతో వేషాలు వేయకముందే నువ్వు మన కాలేజీ లెక్చరర్ సత్యపాల్‌తో తిరిగావు ఇంటర్ పాసవ్వటానికి. ఏదో కేసులో యిరుక్కున్న నీ తండ్రిని వదిలించటానికి ప్లీడర్ నారాయణ రావు వశంలో వున్నావు కొన్నాళ్ళు. తర్వాత డబ్బు అవసరమై నన్ను పట్టావ్. నీ చరిత్రా, నీవంటి అనేకుల చరిత్రా నాకు తెలిసినదే. అయితే, మీ అందరి నడుమా కళ్ళు కప్పుకుపోయి బ్రతుకుతున్న నా కళ్ళు తెరిపించి, లోకంలోని మంచిని చూపి నన్ను మనిషిని చేసింది మైథిలి!"

"ఓహో" హేళన కురిపించింది మేరీ.

"ఔను మేరీ ! చిన్నచిన్న అవసరాలకూ, పనులకూ కూడా నీతి నియమాలను వదలి మనుష్యులమనే సంగతినే విస్మరించి బ్రతికే మీరందరూ పేదరికాన్ని అడ్డుపెట్టుకొని మీ విశృంఖలతను ధనవంతుల మదంచాటున దాచుకొంటారు. మీ షోకులకూ, అవసరాలకూ నా వంటి తెలివితక్కువవాడిని వాడుకుని నాశనం చేస్తారు. కాని, నిజంగా మీరెవరూ పేద వాళ్ళుకారు. నీతి నియమాలతో ఓ మాదిరిగా జీవితం వెళ్ళదీయగలరు. అయినా, మీ లాలస మిమ్మల్ని నీతికి దూరం చేసింది... మీ ఎవ్వరికీ లేని కష్టాలు మైథిలికి వున్నాయి. కటికదరిద్రం, పైగా సంసారబాధ్యత. అయినా ఆమె మనసు చెదరలేదు. నీతికి దూరం కాలేదు. అటువంటి సంసార పక్షపు స్త్రీతోనే సంసారం చల్లగా సాగుతుంది—

ఆటబొమ్మల అవసరం లేదు - అని తెలుసుకున్నాను. నీకు నావంటి వాళ్ళు ఇంకా ఇంకా దొరుకుతారు. కాని నాకు మైథిలివంటి కన్య దొరకదు. నావంటివారు ఆదుకోవనిదే మైథిలివంటి బుద్ధిమంతురాలికి ఈ నీచప్రపంచంలో చోటుండదు."

"బాగుంది లెక్చర్. పదండే పోదాం ?"

"ఎటూ వచ్చారుగనుక భోజనాలు చేసి వెళ్ళమని కోరుతున్నాను. కోపం వద్దు, నేను చెప్పేది ఒక్కటే మేరీ— జీవితం ఒక వరమైతే, సవ్యంగా బ్రతకడం ఒక కళ. అడ్డ మార్గాలూ, అనవసర ఆకర్షణలూ ఎప్పటికైనా అనర్థమే ఎవరికైనా సరే."

ఎవరో పిలువగా అటు వెళ్ళిపోయాడు ప్రసాదు.

వధూవరులకు అభినందనలు చెప్పేవారినీ, ఫొటోలు తీస్తూన్నవారినీ నిస్సహాయంగా చూస్తూన్నది మేరీ.

ఎవరో విద్వాంసుని గానసభ ప్రారంభమైంది అతిథులకు ఆహ్లాదార్థం.

"చక్కనీ రాజమార్గమూ వుండగా...
సందులూ దూరనేలా మనసా ?..."

మనోరంజకంగా వినవస్తూన్న ఆ కృతి తనకు ఏదో అన్యాపదేశంగా ఉపదేశించుతూన్నట్లే భావించిన మేరీ కనులలో రెండు అశ్రుబిందువులు నిలిచాయి.